మార్చి, ఏప్రిల్‌కు రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

మార్చి, ఏప్రిల్ నెలలు రెన్యువల్ చేయాలని ఆదివాసి మాతృ బహుభాషా ఉపాధ్యాయుల సంఘం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షులు ఎస్ ఆనందరావు, నాయకులు ఎల్లాంగ్, డొంబు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న అదిమ గిరిజన పిల్లలు కోసం తెలుగు, ఇంగ్లీష్, బాషాలు అర్ధం కాక డ్రాపౌట్ సంఖ్య పెరుగుతుందని వారి మాతృ ఆదివాసీ బాషాలోనే విద్యా బోధన సాగించాలని కొంత నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. 2023 - 2024 విద్యా సంవత్సరానికి ఆగస్టు నుండి పిభ్రవరి నెల వరకు రెన్యూవల్ చేసి, మార్చి, ఏప్రిల్ ఈ రెండు నెలలు అర్ధాంతరంగా రోడ్ మీద వదలిశారన్నారు.

అరుకు ఎమ్‌పి సీటు గీతకేనా?

- ఇప్పటికే కుల వివాదంలో మాజీ ఎమ్‌పి
- వైసిపి టికెట్‌కు పెరుగుతున్న గిరాకీ
- రేసులో జిసిసి చైర్ పర్సన్ స్వాతీరాణి

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి, జనసేన, బిజెపితో పొత్తు ఖరారైంది. పొత్తులో భాగంగా 6 ఎమ్మెల్యే సీట్లు, ఆరు ఎంపీ సీట్లు బిజెపి పోటీ పడుతుంది. ఆరు ఎంపీ సీట్లలో అరుకు ఎంపీ నియోజకవర్గం కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అరుకు ఎంపి సీటు తనకే వస్తుందన్న ధీమాతో మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎక్కడికక్కడ ప్రచార హోర్డింగులు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీ గీతను ఇప్పటికీ కుల వివాదం వెంటాడుతూనే ఉంది. ఆమె ఎస్టీ కాదంటూ ఆదివాసీ గిరిజన సంఘాలు పోరాటం చేస్తున్నాయి. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గతంలో ఆమె ఎస్టీ కాదని నివేదిక ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పరిశీలక కమిటీ కూడా ఆమె ఎస్టీ కాదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కోర్టు నుంచి ఆమె స్టే తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. 2014లో ఆమె అరుకు పార్లమెంటు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పుడు రాష్ట్రంలో వైసిపి ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు పొందింది. గెలిచిన తర్వాత కొన్నాళ్లకే ఆమె వైసిపిని వీడి అధికారంలో ఉన్న టిడిపికి దగ్గరగా వ్యవహరించారు. కొన్నేళ్ల తర్వాత సొంత పార్టీని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆ పార్టీని బిజెపిలో విలీనం చేశారు. ఇప్పుడు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్న గీతకే అరుకు ఎంపీ సీటు దక్కే అవకాశాలున్నాయి. కులవివాదాన్ని ఎదుర్కొంటున్న గీత టిడిపి, జనసేన, బిజెపిల ఉమ్మడి అభ్యర్థిగా రంగంలోకి దిగనున్నారు. దీంతో ఆమెకు పోటీగా వైసిపి తరపున ఎంపీ అభ్యర్థి ఎవరనే దానిపై చర్చ నడుస్తోంది.

జిసిసి చైర్‌పర్సన్ డాక్టర్ శోభా స్వాతిరాణి అరుకు ఎంపీ సీటు రేసులో వున్నారు. ఇప్పటికే ఆమె తన ఓటును ఎస్.కోట నియోజకవర్గం నుంచి సాలూరుకు బదిలీ చేయించుకున్నారు. డాక్టర్ స్వాతీరాణి ఎస్టీ భగత సామాజిక వర్గానికి చెందిన నాయకులు కావడం, అరుకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భగత సామాజిక వర్గం అధిక సంఖ్యలో ఉండడం ఆమెకు అనుకూల పరిణామంగా కనిపిస్తోంది. దీనికి తోడు ఆమె భర్త గుల్లిపిల్లి గణేష్‌కు సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన నాయకులతో సత్సంబంధాలు వుండడం కూడా అనుకూల పరిణామంగా చెప్పవచ్చు. వైసిపి ఎంపీ అభ్యర్థిగా ఇప్పటికే పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని ప్రకటించినా మార్పు తథ్యమనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైసిపి ఎంపీ సీటు కోసం డిమాండ్ పెరుగుతోంది. డిప్యూటీ సిఎం రాజన్నదొర కూడా ఎంపీ రేసులో వున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం ఎంపీ సీటు ఇస్తే పోటీ చేస్తానని రాజన్నదొర పలు మార్లు ప్రకటించారు. అయితే సిఎం జగన్ దష్టిలో ఏముందో ఇంతవరకు అంతు చిక్కడం లేదు. అభ్యర్థుల జాబితా విడుదల అయితే గాని సస్పెన్స్ కి తెర పడే అవకాశం లేదు.

కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులివ్వాలి

ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి - సీతానగరం

భూ యజమానుల సంతకంతో సంబంధం లేకుండా వాస్తవ కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులు ఇవ్వాలని, స్కేల్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజూరు చేయాలని ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, విత్తనం నుండి అన్ని పెట్టుబడులు విపరీతంగా పెరిగాయని, వీటికి తోడు ప్రకృతి వైపరీత్యాలు వల్ల కూడా సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆటంకాలన్నీ అధిగమించి ఉత్పత్తి చేసిన పంటకు గిట్టుబాటు ధర లేదని, కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా దక్కడం లేదన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతుల ప్రత్యేకించి కౌలు రైతులు నష్టాల ఊబిలో కూరికిపోయి చివరికి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 70శాతం కౌలు రైతులు ఉంటారన్నారు. వీరు సాగు మొత్తాన్ని నెత్తికెత్తుకుని మోస్తున్న ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహాయం కానీ భరోసా కాని అందడం లేదన్నారు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రుణ అర్హత కార్డులు (ఎల్ఇసి) చట్టం తెచ్చిందని, భూ యజమాని అనుమతి లేకపోయినా, కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా కార్డు ఇచ్చేవారని అన్నారు. అలా ఇచ్చేదానికి ప్రత్యేక యంత్రాంగం చిత్తశుద్ధి కొరవడడం వల్ల కేవలం 17.7శాతం కౌలు రైతులకు కార్డు వచ్చాయన్నారు. దీంతో కౌలు రైతుల ఒత్తిడి, ఉద్యమాల వల్ల వ్యవసాయ శాఖ సాగు ధ్రువీకరణ పత్రాలు (సిఒసి)ఇచ్చారన్నారు. అయినా ఎక్కువ శాతం మంది కౌలు రైతులకు కార్డులు రుణాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులో రుణాలు ఇవ్వడం లేదని, ముందస్తు క్యాష్ కౌలు విధానం చాలా దారుణమైన దోపిడీ కాబట్టి ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయ భూములు సాగు చేస్తున్న వారందరికీ సిసిఆర్ కార్డులు, బ్యాంకు రుణాలు, రైతు భరోసా పంట నష్టపరిహారం బీమా ఇవ్వాలని, సిసిఆర్ కార్డుతో సంబంధం లేకుండా సాగు చేస్తున్న వారందరికీ ఈ క్రాఫింగ్ చేయాలని కోరారు. ప్రతి మూడు నెలలకు వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకర్లు రైతు సంఘాలతో ఉమ్మడి సమావేశాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ఇస్తున్న పెట్టుబడి సాయం 10 ఎకరాల వరకు ఎకరాకు రూ.పదివేలు ఇవ్వాలని, సర్టిఫికెట్లతో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతులను గుర్తించి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని, పంటల బీమా రాష్ట్ర ప్రభుత్వమేని నిర్వహించాలని, సన్న, చిన్న కారు రైతులు, కౌలు రైతుల ఇన్సూరెన్స్ బీమా ప్రభుత్వమే కట్టాలని, కౌలు రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ప్రతి పేద కౌలు రైతుకు నెలకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని, ముందస్తు క్యాష్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, కౌలు రైతు సంఘం కమిటీ సభ్యులు బి.సావిత్రమ్మ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్రప్రధానకార్యదర్శి

సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

ప్రిజం-10పై అవగాహన ఉండాలి

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలకు సంరక్షణ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పాలకొండ

తల్లి ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాధరావు తెలిపారు. పట్టణంలోని నీలమ్మకాలనీ యుపిహెచ్‌సిని శనివారం ఆయన సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ప్రిజం-10 అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిజం-10 కార్యక్రమాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించి వాటి ఉపయోగాలు గూర్చి వివరించారు. గర్భిణీలు, బాలింతలకు కేటాయించిన పౌష్టికాహారం, మందులను వారే వారు వినియోగించుకోవాలని, సమయానికి ఐరన్‌కు సంబంధించి మాత్రలు వేసుకోవాలని సూచించారు. తద్వారా మాతృ మరణాలను తగ్గించవచ్చున్నారు. పదేళ్లలోపు గల పిల్లల మరణాల నివారణ ప్రిజం 10 ఉద్దేశ్యమని ఆయన చెప్పారు. తల్లి గర్భం నుంచి శిశువు ఆరోగ్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. గర్భం దాల్చిన వెంటనే పేర్లను నమోదు చేసుకోవాలని, కాలానుగుణంగా వైద్య పరీక్షలు చేసుకోవాలని ఆయన కోరారు. ఆరోగ్యకర సమాజం ఆవిష్కృతం కావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌష్ఠిక ఆహారం, మందులు, వివిధ ప్రయోజనాలు అందిస్తున్నాయని చెప్పారు. కుటుంబ సభ్యులు సహకరించి గర్భిణీ, బాలింతలకు అందించే ఆహారం వారే తినే విధంగా తోడ్పడాలన్నారు. రక్త హీనత నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అవగాహన కార్యక్రమంలో నీలమ్మకాలనీ యుపిహెచ్సీ వైద్యాధికారి కొక్కిరపాటి తేజ్ రతన్ రాజ్, వైద్య ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సాధికారత ఏదీ?

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఐద్వా నాయకులు

ప్రజాశక్తి - సీతానగరం

మహిళా సాధికారత గురించి గొప్పలు చెబుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు హక్కులు, రక్షణ కల్పించడంలో చాలా నిర్లక్ష్యంగా ఉన్నాయని, ఇప్పటికీ మహిళలకు సమానత్వం, స్వేచ్ఛ లేదని అఖిలభారత మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి అన్నారు. సీతానగరంలో ఐద్వా నాయకులు వి.రామలక్ష్మి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భావం, ఆవశ్యకతను వివరించారు. మహిళలకు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, షాపింగ్ మాల్స్, బట్టల షాపుల్లో మహిళలకు కనీస సౌకర్యాల్లేవన్నారు. మహిళా సాధికారత చెప్పి మహిళా దినోత్సవం ఒక ఈవెంట్ లాగా మార్చేశారన్నారు. బిల్ ఖిస్ భానో, మనీషా, వాల్మీకి లాంటి మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేస్తున్న మహిళలకు న్యాయం జరగడం లేదన్నారు. ఇప్పటికీ మతం పేరిట మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. 33శాతం రిజర్వేషన్ వట్టిమాటగా ఉండిపోయిందని, రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం ఉన్నా పురుషుల ఆధిపత్యం ఎక్కువగా ఉందన్నారు. ఇప్పటికీ స్కీం వర్కర్లకు కనీస వేతనాలు, కనీస సౌకర్యాలు లేవన్నారు. కావున అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టుదలతో సమస్యల పరిష్కారానికే పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, మధ్యాహ్న భోజన కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి, ఐద్వా నాయకులు ఆర్.లక్ష్మి, స్కీమ్ వర్కర్స్ సునీత, పుణ్యవతి, రవణమ్మ తదితరు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఐద్వా నాయకులు కె.దాలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా మాట్లాడుతూ మహిళా సాధికారత గురించి గొప్పలు చెబుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు హక్కులు కల్పించడంలోనూ రక్షణ కల్పించడంలో నిర్లక్ష్యంగా ఉన్నాయని విమర్శించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మహిళలంతా పట్టుదలతో సమస్యలు పరిష్కారానికే పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు యు.లక్ష్మి, ఐద్వా నాయకులు సుధా, రైతు సంఘం నాయకులు భానుమూర్తి, ఇంద్ర, సావిత్రి, నారాయణమ్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పాచిపెంటలో శ్రామిక మహిళా నాయకులు కె.పార్వతీదేవి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి విజయగౌరి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళలకు రక్షణ లేకుండా చేస్తుందని విమర్శించారు. పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను చట్టాలను కాలరాస్తుందన్నారు. మణిపూర్ ఘటన యావత్ భారతదేశాన్ని కలిసి వేసిందని, ఇటువంటి ఉన్మాదుల వలన మహిళలకు ఎటువంటి రక్షణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కావున మహిళలంతా సంఘటితంగా బిజెపి విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా ఇంకా అనేక రూపాల్లో వివక్షత కొనసాగుతూనే ఉందని, పోరాడి సాధించుకున్న చట్టాల పట్ల మహిళలకు అవగాహన కల్పించి, వారి రక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వెంపటాపు శోభ, వై.మంగమ్మ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం : సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి

బలిజిపేట : సదస్సులో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం నాయకులు ఇందిర

పాచిపెంట : సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

అచ్చెన్నాయుడు వద్దకు పాలకొండ నేతలు

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి టికెట్ విషయంలో నేటికీ క్లారిటీ రాకపోవడంతో టిడిపి కేడర్‌లో గందరగోళం మొదలైంది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నిమ్మక జయకృష్ణతో పాటు పడాల భూదేవి, గేదెల రవి, మరి కొందరు టికెట్ కోసం గట్టిగానే పోరాడుతున్నారు. మొదటి నుంచి జయకృష్ణకు టికెట్ ఇవ్వొద్దని ఒక బలమైన సామాజిక వర్గ నేతలు వ్యతిరేకిస్తుండడంతో టికెట్ విషయంలో పార్టీ అధిష్టానం ఎటువంటి క్లారిటీ ఇవ్వడం లేదు. పొత్తులో భాగంగా జనసేనకు సీటు కేటాయిస్తారని వారం రోజుల నుంచి చర్చనీయాంశమవుతుంది. దీనితో జయకృష్ణ వర్గీయులు శుక్రవారం పాలకొండ, వీరఘట్టం, భామిని మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి జయకృష్ణకు టికెట్ ఇవ్వాలని కోరడంతో పార్టీ కేడర్‌లో చర్చనీయాంశమవుతుంది. జయకృష్ణ తమ అభ్యర్థిని చెప్పుకున్న నేతలు జయకృష్ణకు ఒక అవకాశం ఇవ్వాలని కోరడంతో పార్టీలో చర్చనీయాంశం అవుతుంది. తాజాగా శనివారం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడును జయకృష్ణతో పాటు ఆయన తల్లి, ఆయన వర్గం కలిసి టికెట్ తమకు కేటాయించాలని కోరినట్టు సమాచారం. ఆయన వ్యతిరేక వర్గం కూడా అచ్చెన్నాయుడును కలిసినట్లు సమాచారం. అయితే టికెట్ విషయంలో అచ్చెన్నాయుడు ఎటువంటి హామీ ఇవ్వలేదని తెలుస్తుంది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, టికెట్ ఎవరికి ఇచ్చినా పని చేయాలని సూచించినట్లు తెలుస్తుంది.

ఆరోగ్య పోషణపై సర్వే

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో బియ్యాలవలస పంచాయతీ దురిబిలి గిరిజన గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్న ఆహార ఉత్పత్తులను తింటున్న ఆ ప్రజల ఆరోగ్యంపై హెల్త్ అండ్ న్యూట్రిషన్, ప్రకృతి వ వ్యవసాయ డిపిఎం పి. షణ్ముఖ రాజు ఆధ్వర్యంలో శనివారం సర్వే చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్య పోషణ కార్యక్రమాల పద్ధతులను రైతులు తమ జీవన విధానంలో పాటిస్తున్నారన్నారు. వారు పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించడం ద్వారా వారి కుటుంబాల ఆరోగ్యానికి సంబంధించిన కిడ్నీ, లివరు, రక్త శాతం, రక్త హీనత, బి.పి, సుగర్ వంటి వ్యాధులు ప్రస్తుత పరిస్థితిని తెలుసుకోవడానికి శాంపిల్స్ తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఆర్‌వైఎస్ఎస్ ల్యాబ్ టెక్నీషియన్ డి. మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న సిసి కెమెరాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు వల్ల జీరో మాల్ ప్రాక్టీస్‌ల కేసులను జిల్లాలో సాధించగలిగామని డిఐఇఒ మంజులవాణి తెలిపారు. శనివారం సీసీ కెమెరాల నియంత్రణ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు మార్చి 1న ప్రారంభమై నేటికీ పది రోజులు గడుస్తున్నాయని, అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ సిసి కెమెరాలతో పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడమే కాకుండా నిరంతర పర్యవేక్షణ చేస్తుండడంతో ఈ ఏడాది మాల్‌ప్రాక్టీస్ కేసులు ఇంతవరకు నమోదు కాలేదని ఆమె అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 32 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా మొదటి సంవత్సరం పరీక్షలకు 5,756 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 5,700 మంది హాజరు అవుతున్నారని. సప్లిమెంటరీ విభాగంలో 1744 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్ మెంట్ అధికారులు, 2 సిట్టింగ్ స్క్వాడ్ లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ ఇలా పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. పరీక్ష కేంద్రాల దగ్గర పోలీసులు బందోబస్తు, 144 సెక్షన్ అమలు జరుగుతుండగా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసామని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా ప్రజా రవాణా అధికారులు బస్సులు నడిపి సహకరిస్తున్నారని తెలిపారు.



సిసి కెమెరాల ద్వారా పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న డివిఇఒ మంజులవాణి

ఏజెన్సీ బంద్ విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి- కొమరాడ

ఆదివాసీల హక్కుల రక్షణకై ఆదివారం తలపెట్టిన ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. బంద్‌కు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని కూనేరు సంతలో శనివారం ప్రచారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు ప్రసాదు, బాబురావు నాగేశ్వరరావు బిజెపి ప్రభుత్వం వన సంరక్షణ పేరుతో 1/70 చట్టానికి తూట్లు పొడుస్తుందని, గిరిజన సంపదైన గనులు, ఖనిజాలు, విలువైన భూములను కొల్లగొట్టి కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు కట్టపెడుతుందన్నారు. గతంలో టిడిపి, ఇప్పుడు వైసిపి బిజెపి అడుగులకు మడుగులొత్తుతూ గిరిజనుల హక్కులను. గిరిజన సంపదను దోపిడీదారులకు కట్టబెడుతున్నారని అన్నారు. కావున గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం కొమరాడలో జరుగుతున్న ఏజెన్సీ బంద్‌ను గిరిజన ప్రజలు ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గిరిజన మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సీతంపేట : ఆదివారం తలపెట్టిన మన్యం బంద్ విజయవంతం చేయాలని గిరిజన సంఘం నాయకులు ఎం లక్ష్మణరావు, సాయికుమార్, జై శ్రీరాములు, పాలక్ సాంబయ్య ఒక ప్రకటనలో కోరారు. ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు 100శాతం గిరిజనులకే ఇవ్వాలని, జీవో 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు గిరిజన సంఘాల నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు.

సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

భూ పంపిణీ అంటే ఇదేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎడమ చేతితో ఇచ్చేసి కుడిచేతితో లాగేసుకున్నాడట వెనుకటి ఓ ధర్మదాత. గిరిజనులకు భూమి పంపిణీ, అనగారిన వర్గాలకు కల్పిస్తున్న భూ హక్కుల తీరుతెన్నులు అచ్చంగా అలాగేవున్నాయి. గిరిజన అటవీ హక్కుల చట్టం ప్రకారం వారి సాగులోవున్న భూమి అత్యధికంగా పది ఎకరాల వరకు ఇవ్వవచ్చు. ఇక భూమిలేని దళితులకు అసైన్డ్ ల్యాండ్ ఇవ్వాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. పేదలు, వృత్తిదారుల సాగులోవున్న భూములు లాక్కోకూడదన్నది ఏ చట్టమో చెప్పనక్కర్లేదు. మానవత్వం ఉన్నవారెవరైనా ఇట్టే చెప్పగలరు. కానీ, విజయనగరం, పార్వతీపురం జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. 20ఏళ్లపైబడి సాగులోవున్న అసైన్‌మెట్ భూములు సంబంధిత డి-పట్టాదారులకు రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఎక్కడా అది నామమాత్రంగానే అమలు జరిగింది. మెంటాడ మండలంలోని వందలాది ఎకరాల అసైన్డు, సీలింగ్, అటవీశాఖ భూమి గిరిజనులు, దళితులు, పేదలు సాగుచేసుకుని దశాబ్ధాలు తరబడి జీవనం సాగిస్తున్నారు. కాలక్రమంలో ఈ భూములపై పెత్తందార్ల కళ్లుపడ్డాయి. అర్థబలం, రాజకీయ బలంతో తప్పుడు పత్రాలు సృష్టించుకుని లాగేసుకుంటున్నారు. దీనిపై ఆ ప్రాంత అమాయక గిరిజనులు, దళితులు, పేదలు ఎంతమొత్తుకున్నా అధికారులకు వినిపించడం లేదు. పైగా ఆక్రమణదారులకు అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టినా అటు అధికారుల్లోగానీ, ఇటు రాజకీయ నాయకులకుగానీ పట్టడం లేదు. దీంతో, ఆక్రమణదారులకు సాక్షాత్తు డిప్యూటీ సిఎం రాజన్నదొర కొమ్ము కాస్తున్నారని, గిరిజనుడై ఉండి గిరిజనులనే వంచనకు గురిచేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించడమే గిరిజనులు చేసుకున్న పాపమా అంటూ గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో 18 కొండలను గుల్ల చేసేందుకు రాజన్నదొర అనుమతిచ్చి బడాబాబుల సేవలో మునిగి తేలుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాలూరు నియోజకవర్గ పరిధిలో 3200మంది గిరిజనులు పట్టాలు కోసం ఎదురు చూస్తుండగా, ఇప్పటికి కేవలం 490 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సమస్య పరిష్కరించాలని కోరితే మంత్రి తిరిగి ఎదురు దాడి చేస్తున్నారని జనం మండిపడుతున్నారు.

దత్తిరాజేరు మండలం చినచామలాపల్లి సర్వే నెంబర్లు 1,2,3,100,101లో ఉన్న సుమారు 50ఎకరాల డి-పట్టా భూమిలో అదే గ్రామానికి చెందిన గొర్రెలు మేకలు పెంచుకుంటూ జీవిస్తున్నారు. ఈ భూమి తప్ప వారికి ఏ ఆధారమూ లేదు. ప్రభుత్వం కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు పేరిట ఈ భూమిని లాగేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇదే జరిగితే వృత్తిదారుల జీవనం అస్తవ్యస్తంగా మారనుంది. దీంతో తమకు న్యాయం చేయాలంటూ వారు తిరగని చోటు లేదు. సిపిఎం ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ వరకు ఎన్నోసార్లు కలిసి వినతిపత్రాలు అందజేశారు. వాటిని అధికారులు ఇప్పటికీ పట్టించుకోకపోవడంతో గొర్రెలు, మేకల పెంపకం దారులు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇవేవీ అధికారులు, ప్రజాప్రతినిధులకు పట్టడం లేదని, ఎన్నికల్లో ఓట్ల కోసం మాత్రం రాజకీయ పార్టీలకు చెందిన వారు ఎగేసుకుని తమ వద్దకు వచ్చేస్తారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాధితులకు చెక్కును అందజేస్తున్న రాజశేఖరం

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పాలకొండ

శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి పాలకొండ నగరపంచాయతీపరిధిలోని పెద్దకాపు వీధికి చెందిన పైల హర్షితకు మంజూరైన ఆర్థిక సహాయం రూ.2లక్షలు, కోమటపేటకు చెందిన కోట్ని కల్పనకు మంజూరైన ఆర్థిక సాయం రూ.4లక్షల చెక్‌లను శనివారం వైసిపి సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దుప్పాడ పాపి నాయుడు, తుమ్మగుంట శంకర్రావు, కిల్లారి మోహన్ రావు, ముడిలి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టా డాక్యుమెంట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక నగర పంచాయతీకి సంబంధించిన 1341, మండలానికి సంబంధించి 541 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లు వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించి దస్తావేజులను శాసన మండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అందజేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ కణపాక సూర్య ప్రకాష్, వాకమూడి అనిల్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, కౌన్సిలర్లు దుప్పాడ పాపి నాయుడు, కొంచాడ అరుణ్, ఆకుల కుమార్, పల్లా భాను, కిల్లారి మోహన్ రావు, తూముల లక్ష్మణరావు, సర్పంచులు, ఎంపిటీసీలు, నగర పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత బెంచీలను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ సుజాత, ఉపసర్పంచ్ ఆదిల్

విశ్రాంతి బెంచీలు ఏర్పాటు

ప్రజాశక్తి - కురుపాం

మేజర్ పంచాయతీ కురుపాంలో గల ప్రధాన వీధులు, రహదారి జంక్షన్ల వద్ద వృద్ధులు, యువత, ప్రజలు నిలుచొని ఉండడంతో సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ ఆర్థిక సంఘం నిధులతో 40 విశ్రాంతి బెంచీలను కొని శనివారం పలు వీధుల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో గల ప్రధాన వీధులు, రహదారి జంక్షన్ల వద్ద వృద్ధులు, యువత నిలుచొని ఉండేవారని, వీరు సేద తీర్చు కొనేందుకు ఈ విశ్రాంతి బెంచీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కావున ఈ బెంచీలు ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అంతరాయంతో అవస్థలు

ప్రజాశక్తి -భామిని

శుక్రవారం రాత్రి భామినిలో 8 గంటల ప్రాంతంలో వర్షం రావడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గంట తర్వాత వర్షం పూర్తి స్థాయిలో తగ్గిన విద్యుత్ సరఫరా జరగలేదు. సుమారు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతోఉక్కపోతతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 12 గంటలకు తర్వాత మళ్లీ విద్యుత్ సరఫరా చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న తోట సింహాచలం

బూత్ కమిటీలు కీలకంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి -భామిని

ప్రతి పంచాయతీ బూత్ కమిటీలు పాత్ర చాలా కీలకమని, ఓటర్లు జాబితా పూర్తి స్థాయిలో పరిశీలించి, ఓటర్లు సన్నద్ధం చేసే బాధ్యత మీపై ఉందని వైసిపి కన్వీనర్ తోట సింహాచలం అన్నారు. మండలంలోని భామిని, లివిరి సచివాలయంలో బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలు షెడ్యూల్ త్వరలో ఎన్నికలు కమిషన్ ప్రకటించనున్న నేపథ్యంలో, బూత్ కమిటీ క్షేత్ర స్థాయిలో ఓటర్లు జాబితా, పోలింగ్ బూత్‌లు పరిశీలించి, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గం గెలుపునకు ఐక్యంగా కృషి చేయాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కన్వీనర్, జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, ఎంపిటిసి ప్రతినిధి బిడ్డిక కృష్ణారావు, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కన్వీనర్ గవర వెంకటరమణ, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణలు కోరారు. శనివారం వికలాంగులంతా కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్లెక్సీకటౌట్‌కు వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగుల 2016 ఆర్పీడీయాక్ట్‌ను సక్రమంగా అమలు చేయాలని, వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలని, బ్యాలాగ్ పోస్టులు భర్తీ చేయాలని, వికలాంగులకు ఇల్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, 35 కేజీల అంత్యోదయ కార్డు ఇవ్వాలని, వ్యక్తిగత రేషన్ కార్డు మంజూరు చేయాలని తదితర డిమాండ్లు రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టో ద్వారా విడుదల చేసి తక్షణమే వికలాంగుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అలా ఏ రాజకీయ పార్టీ అయితే వికలాంగుల సమస్యలపై దృష్టి సారిస్తాదో వారికే రాబోయే ఎన్నికల్లో మా మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగులు నక్క త్రినాధ, రాయిపల్లి భాస్కరరావు, అడవి నాయుడు, తవిటమ్మ, జానకి పార్వతీపురం సీతానగరం బలిజిపేట మండలాల వికలాంగులు పాల్గొన్నారు..

ఎమ్మెల్యే పోస్టర్‌కు వినతిని అందజేస్తున్న వికలాంగులు

చరిత్ర ఘనం... సమస్యలు అధికం

- అసౌకర్యాల నడుమ తరగతుల నిర్వహణ
- ఆరు బయట వంటలు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం
- బయటకు పరుగులు తీస్తున్న విద్యార్థులు
- వీరఘట్టం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల దుస్థితి

ప్రజాశక్తి - వీరఘట్టం

విద్యాభివృద్ధికి ప్రతి ఏటా బడ్జెట్లో అధిక శాతం నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తుందో తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. అంతేకాక సర్కారు బడులను కార్పొరేట్ తరహాలో తీర్చుదిద్దామని చెబుతున్న పాలకులు మాటలకు మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో పరిస్థితికి పొంతనలేదు. ఈ పాఠశాలలో సమస్యలు కోకొల్లులగా ఉన్నాయి. ఎంతో చరిత్ర కలిగి ఈ పాఠశాల పరిస్థితి ప్రస్తుతం పరమ అధ్వానంగా ఉంది.

మండల కేంద్రమైన వీరఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో ఆరో తరగతి నుండి పదో తరగతి 307మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలను 1950లో స్థాపించారు. అప్పట్లో ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు 1600 నుండి 1700 వరకు విద్యార్థులు విద్యను కొనసాగించడంతో రాష్ట్రంలో ఈ పాఠశాలకు ఒక ప్రత్యేకత ఉన్నట్లు పూర్వపు విద్యార్థులు చెబుతున్నారు. ఇంత ప్రత్యేకత ఉన్న ఈ పాఠశాల ప్రస్తుత పరిస్థితిని చూస్తే హృదయవిదారకంగా మారింది.

ఆరు బయట వంటలే

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు పాఠశాలలో వంట గదిలేక నిర్వాహకులు ఆరుబయటే వంటలు చేస్తున్నారు. లక్ష రూపాయల అంచనా వ్యయంతో వంటగది నిర్మించినప్పటికీ లోపల వంట చేసినప్పుడు చుట్టూ పొగ కమ్మడంతో నిర్వాహకులు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక ఆరుబయటే వంటలు చేయడం మొదలుపెట్టారు. ఎండైనా, చినుకైనా, గాలైనా విద్యార్థులకు వంటలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

మూలకు చేరిన మరుగుదొడ్లు

విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు ఆరు బయటకు వెళ్లి కాలకృత్యాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పాఠశాల పక్కన ప్రధాన రహదారి ఉండడంతో ప్రతిరోజు వందలాది భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో ఎప్పుడు ఏ విధమైన ప్రమాదవవార్త వినాల్సి వస్తుందోనని ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థుల తల్లిదండ్రులు భయంతో కాలం వెలదీస్తున్నారు. ఏ విధమైన ప్రమాదం జరగక ముందే అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్ధాంతరంగా నిలిపివేసిన నూతన భవనాలు

అర్ధాంతరంగా నిలిచిపోయిన భవనాలు

పాఠశాల ఆవరణలోనే 2021లో రూ.కోటీ 60 లక్షలతో నాబార్డ్ నిధులతో 8 గదుల నిర్మాణ పనులు చేపట్టారు. కింద భాగంలో నాలుగు రూములు, పైభాగంలో నాలుగు రూములు నిర్మించారు. అయితే కింద నాలుగు రూముల ప్లాస్టింగు, గచ్చులు వేసినప్పటికీ కనీసం వైరింగ్ చేయకపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో చీకట్లోనే చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొద్ది రోజుల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ పాఠశాల పరీక్షా కేంద్రంగా గత కొంతకాలం నుంచి కొనసాగుతున్నప్పటికీ విద్యుత్ సౌకర్యం అంతంత మాత్రమే. దీంతో విద్యార్థులు పరీక్షలు రాయాల్సిన సమయంలో అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు, విద్యాశాఖ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి సమస్య లేని పాఠశాలగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరుబయట వంటలు చేస్తున్న నిర్వాహకులు

గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సే ధ్యేయం : డిఎంఒ

ప్రజాశక్తి - సీతానగరం

గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సుకై అంకిత భావంతో వైద్య సేవలందజేయాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. స్థానిక పిహెచ్‌సిలో నిర్వహించిన పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, వాటి నివేదికలను మాతా, శిశు సంరక్షణ కార్డులో పరిశీలించారు. కొత్తగా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణీల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయి సిబ్బంది సులభంగా గుర్తించే పద్ధతులను ఆయన వివరించారు. గర్భిణులతో మాట్లాడి పలు ఆరోగ్య సలహాలు సూచించారు. ప్రిజం10 ఉద్దేశ్యాన్ని వివరిస్తూ, ప్రస్తుత కార్యాచరణపై సిబ్బందికి సూచనలు చేశారు. రక్త హీనతగా గుర్తించిన గర్భిణీ లకు సిబ్బంది సమిష్టి కృషితో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలో గర్భిణులకు వైద్య సేవలు అందజేయడంలో సేవా దృక్పథాన్ని కనబర్చి వారి ఆరోగ్య వృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పావని, సూపర్‌వైజర్స్ సత్యవతి, శర్మ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బలిజిపేట : గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సే ధ్యేయంగా అంకిత భావంతో వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఒ) డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. అరసాడ పిహెచ్‌సిలో శనివారం నిర్వహించిన పిఎంఎస్ఎంఎ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహిస్తున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు పరిశీలించి వాటి నివేదికలను మాతా శిశుసంరక్షణ కార్డులో తనిఖీ చేశారు. కొత్తగా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే హైరిస్క్‌గా పరిగణించి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్య సమస్యలను క్షేత్ర స్థాయి సిబ్బంది సులభంగా గుర్తించే పద్ధతులను డాక్టర్ జగన్ వివరించారు. గర్భిణులతో మాట్లాడి పలు ఆరోగ్య సలహాలు సూచించారు. ప్రిజం10 ఉద్దేశ్యాన్ని వారికి వివరిస్తూ, ప్రస్తుత కార్యచరణపై సిబ్బందికి సూచనలు చేశారు. రక్త హీనతగా గుర్తించిన గర్భిణులకు సిబ్బంది సమిష్టి కృషితో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలో గర్భిణులకు వైద్య సేవలు అందజేయడంలో సేవా దృక్పథాన్ని కనబర్చి వారి ఆరోగ్య వృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పావని, సూపర్ వైజర్స్ నారాయణరావు, కె.సత్యవతి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎంఒ జగన్మోహన్

చర్చి పాస్టర్ల రహస్య సమావేశం

టిడిపి అభ్యర్థి సంధ్యారాణి హాజరు

ప్రజాశక్తి- సాలూరు

పట్టణంలోని శ్రీ కోదండరామ కళ్యాణ మండపంలో శనివారం ఉదయం చర్చి పాస్టర్ల రహస్య సమావేశం నిర్వహించినట్లు తెలుస్తోంది. టిడిపి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమావేశానికి నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల నుంచి పాస్టర్లు హాజరయ్యారు. బయట నియోజకవర్గాలకు చెందిన పాస్టర్లు కూడా హాజరయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి. టిడిపి అభ్యర్థి జి.సంధ్యారాణి సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశం పట్టణానికి చెందిన ఓ రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్‌పి కనుసన్నల్లో జరిగినట్లు సమాచారం.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి- బలిజిపేట

మండలంలో స్థానిక జూనియర్, ప్రైవేట్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం స్క్వాడ్ పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ కళాశాలలో 319 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 24 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపర్‌డెంట్ పివి గోపాలకృష్ణ, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ ఆర్ఎస్‌విజి కృష్ణారావులు తెలిపారు.

ప్రశాంతంగా హిందీ పరీక్ష

కురుపాం : మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ ఆధ్వర్యంలో పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. విశారద, భూషణ్ పరీక్షలకు 56 మందికి గాను 51 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.శంకరరావు తెలిపారు.

ఐటిడిఎ పిఒకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

గిరిజన ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాలి

ఐటిడిఎ పిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి - సాలూరు

మండల కేంద్రమైన సాలూరుకు మంజూరైన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు, ఎం.శ్రీనివాసరావు కోరారు. శనివారం వారు మండల తహశీల్దార్ కార్యాలయంలో ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐటిడిఎ పరిధిలోని అన్ని మండల కేంద్రాల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు వున్నాయని, సాలూరులో ఉన్నది ఎత్తివేశారని చెప్పారు. ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, సిపిఎం గతంలో ఆశ్రమ పాఠశాల మంజూరు చేయాలని ఆందోళన చేపట్టాయని తెలిపారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, హాస్టళ్లలో వివిధ అనారోగ్య కారణాలతో విద్యార్థులు మరణిస్తున్నారని, వెంటనే ఎఎన్ఎంలను నియమించాలని కోరారు. దీనిపై ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామక ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు.

మూతపడిన గదబవలస పాఠశాల

పాఠశాలను పునః ప్రారంభించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలో మూసివేసిన పాఠశాలను పునః ప్రారంభించేందుకు విద్యాశాఖ ఉన్నత స్థాయి అధికారులు చొరవ చూపాలని మండలంలోని గదబవలస పంచాయతీ సర్పంచ్ రాయల దాలమ్మ డిమాండ్ చేశారు. గతంలో ఈ పాఠశాలలో సుమారు 70మంది విద్యార్థులు చదుకొనేవారు. ఒకే ఒక తరగతి గది ఉండడం వల్ల అదనపు పాఠశాల భవనం నిర్మించేందుకు 2011- 12 ఆర్థిక సంవత్సరంలో రాజీవ్ విద్యా మిషన్ ఆధ్వర్యంలో రూ.5.30 లక్షలతో అదనపు నిర్మాణ భవనం పనులు చేపట్టారు. అదనపు భవనం పూర్తయ్యేసరికి విద్యార్థుల్లేరన్న నెపంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలను మూసివేశారు. అదనంగా నిర్మించిన భవనం ప్రారంభం కాకముందే మూసి వేసినట్లు గిరిజనులు వాపోతున్నారు. ఇక్కడ పాఠశాల మూసివేయడంతో తమ పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కత్తులకవిటి పాఠశాలలో చేర్పించారు. దీంతో పిల్లల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 25 మంది వరకు పిల్లలున్నారని, ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్న స్థాయి అధికారులు తమ గ్రామానికి వచ్చి పరిశీలించి మూసివేసిన పాఠశాలను పునః ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

ఎన్నికల కోసమే గ్యాస్ ధర తగ్గింపు

బొబ్బిలి : సార్వత్రిక ఎన్నికల్లో లబ్ది పొందేందుకే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర తగ్గించిందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు గ్యాస్ సిలెండర్ పై రూ.100 తగ్గించి ప్రజలను మోసం చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ముడి చమురు ధరలు తగ్గుతున్నా దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం లేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

38వ రోజుకు మిమ్స్ ఉద్యోగుల పోరాటం

నెల్లిమర్ల : మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం చేస్తున్న నిరశన సమ్మె 38వ రోజుకి చేరుకుంది. శనివారం స్థానిక ఆర్ఒబి వద్ద నిరసన కొనసాగించారు. మొక్కవోని దీక్షతో యూనియన్ వెంటే ఉంటామని ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. సిఐటియు సమక్షంలో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తేనే విధులకు హాజరవుతామని స్పష్టం చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల పక్షాన నిలిచి సమస్యలు పరిష్కారం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

11న రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ దారుల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక రిటైర్డ్ పెన్షన్ దారుల భవనంలో పార్వతీపురం సబ్ ట్రెజరీ పరిధిలో గల రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ దారుల సమావేశం ఈనెల 11న జరుగుతుందని రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ దారుల ప్రధాన కార్యదర్శి డి.గణపతి రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో లైఫ్ సర్టిఫికెట్లు, ఆదాయపన్ను, తదితర విషయాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి రిటైర్ పెన్షన్ దారులంతా తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పాచిపెంటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పలుచోట్ల పోలీస్ కవాతు

ప్రజాశక్తి - పాచిపెంట

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో శనివారం స్థానిక పెట్రోల్ బంకు నుండి పెద్దగెడ్డ రిజర్వాయర్ వరకు సాలూరు సిఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ బాలకష్ణ మాట్లాడుతూ ఎన్నికల ప్రశాంతంగా జరిపేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై పి.నారాయణ రావు, ఎఎస్ఐ బి.ముసలయ్య 85 మంది పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో ఏజెన్సీ ముఖద్వారమైన మొండెంఖల్‌లో ఎల్విన్‌పేట సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా పరంగా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ కవాత్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సిఆర్పీఎఫ్ సిఐ ఐఎస్ఎన్ రాజు, స్థానిక ఎస్సై నీలకంఠేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని పాలకొండ సిఐ ఎం.చంద్రమౌళి ఆధ్వర్యంలో పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోనే అన్ని వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో భాగంగా ఓటర్లు ఎటువంటి భయం లేకుండా సజావుగా ఓటు వేసుకొచ్చినని మీకు మేం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎం గోవిండ్, పోలీసులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా పనిచేసి విజయం సాధించండి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం నియోజక వర్గ అభ్యర్థి విజయచంద్రతో క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పనిచేసి విజయ బావుటా ఎగురవేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడు అన్నారు. ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో శనివారం పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి గురించి ఆరా తీశారు. సీనియర్ నాయకులు తటస్థులను అభిమానులను నిరంతరం కలుసుకుంటూ క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని కోరారు. టిడిపి, జనసేన, బిజెపి కలయికతో రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీ చాలా బలంగా ఉందని, అలాగే వైసిపి ప్రభుత్వం ముఖ్యంగా సిఎం జగన్మోహన్‌రెడ్డిపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని కనుక కష్టపడితే భారీ మెజారిటీతో వైసిపి అభ్యర్థి విజయం సాధించవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు బోను చంద్రమౌళి, సీతానగరం బలిజిపేట పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన విజయచంద్ర

స్టాపర్ల వితరణ

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

నిత్యం రద్దీగా ఉండే పార్వతీపురం ప్రధాన రహదారి పై ట్రాఫిక్ నియంత్రణకు పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ వివేక్ జయశ్రీ నర్సింగ్ హోమ్ తరుపున ఐదు రహదారి స్టాపర్లను స్థానిక సిఐ కృష్ణారావుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు వివేక్ మాట్లాడుతూ పార్వతీపురం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోయి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సామాజిక బాధ్యతగా తాము పట్టణ పోలీసులకు తమ నర్సింగ్ హోమ్ తరుపున రోడ్డు స్టాపర్లను అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ కృష్ణారావు వివేక్‌ను అభినందించారు.



రోడ్డు స్టాపర్లను సిఐకు అందజేస్తున్న డాక్టర్ వివేక్